

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

విలేకరులు కావలెను
తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన
యువతి యువకులకు జర్నలిస్ట్‌గా పనిచేసేందుకు సదావకాశం
న్యూస్ వార్ దిన పత్రిక
నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు,నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో
వార్తాసేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.
94409 91979

నల్లగొండ | epaper.news war.com | శనివారం 30, మే 2026 | సంపుటి :16 సంచిక :61 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00



## వందేమాతరంపై మళ్లీ రగడ..

### కేరళ గవర్నర్ అసంతృప్తి

కేరళ రాజకీయాల్లో మరోసారి 'వందేమాతరం'పై వివాదం చోటుచేసుకుంది. యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) పాలసీ అడ్రస్ సందర్భంగా అసెంబ్లీలో 'వందేమాతరం' గేయాన్ని పూర్తిస్థాయిలో పాడకపోవడంపై గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ శుక్రవారంనాడు అసంతృప్తి వ్యక్తం చేసారు. అసెంబ్లీ నుంచి బయటకు వస్తూ మీడియాతో ఆయన మాట్లాడారు. అధికారిక కార్యక్రమాల్లో గవర్నర్ ఎప్పుడు హాజరైనా సరైన ప్రోటాకాల్ పాటించాల్సి ఉంటుందని అన్నారు. 2

# జూన్ 1న డీకే ప్రమాణ స్వీకారం..



2 లో..

- సిద్ధరామయ్య తనయుడికి డిప్యూటీ సీఎం!
- శనివారం కీలకమైన సీఎల్‌పీ నేత ఎన్నిక
- ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య
- ఖర్గేను కలిసిన సిద్ధరామయ్య

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాతో డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టనుండటం ఖాయమైంది. నాయకత్వ మార్పు నేపథ్యంలో తన కుమారుడు, ఎమ్మెల్యే యతీంద్ర సిద్ధరామయ్యకు ఉపముఖ్య మంత్రి పదవి ఇవ్వాలని పార్టీ అధిష్ఠానాన్ని సిద్ధరామయ్య కోరినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. కీలకమైన సీఎల్‌పీ నేత ఎన్నిక శనివారంనాడు జరుగనుంది. సీఎల్‌పీ నేతగా డీకే ఎన్నికైన అనంతరం ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది.





## అనుమతి లేకుండా నాగ చైతన్య పేరు, ఫొటో వాడటంపై నిషేధం

తన వ్యక్తిగత హక్కులు, గోప్యతను పరిరక్షించాలని కోరుతూ అక్కినేని నాగ చైతన్య ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలను దుర్వినియోగం చేస్తున్నారని, వాటిని అడ్డుకోవాలని ఢిల్లీ హైకోర్టులో నాగ చైతన్య పిటిషన్ దాఖలు చేశారు. నాగ చైతన్య పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. కోర్టు నాగచైతన్య అభ్యర్థనపై సానుకూలంగా స్పందించింది. 2

### విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించిన

## సమస్యలు పరిష్కరించాలి



మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉన్నతాధికారులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఎదురవుతున్న ఇబ్బందులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటులో అధికారులు, పోలీసులు సమన్వ యంతో పని చేయాలని సూచించారు.

వార్త 2లో


### ఆర్ఎమ్‌యూకి రైళ్ల తయారీ

## బాధ్యత.. ప్రధానికి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు..



కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్( కు 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతర సహకారం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు.రాబోయే ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీనిపై సమీక్ష నిర్వహించి, ఆ బాధ్యతను కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు అప్పగిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నార

వార్త 2లో



2

## బయటి సవాళ్లను దీటుగా ఎదుర్కొనే స్థితిలో భారత ఆర్థిక వ్యవస్థ: ఆర్‌బీఐ

### ఓటర్ల జాబితా విషయంలో

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్:**

దేశంలో బిజెపి విషపూరిత కుట్రలు చేస్తోందని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బిజెపి కుట్రలతో బెంగాల్ లో ప్రభుత్వమే మారిపోయిందని అన్నారు. గాంధీభవన్ లో ఎస్ఐఆర్ పై శిక్షణ శిబిరం లో మీనాక్షి నటరాజన్, సచిన్ సావంత్, మహేష్ గౌడ్ హాజరయ్యారు. పిసిసి ఎంపిక చేసిన 60 మందికి మాస్టర్ ట్రైనింగ్, ఎస్ఐఆర్ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 90కి పైగా నియోజక వర్గాల్లో బిఎల్ఎ, జిల్లా, మండల కమిటీలు దాదాపు పూర్తి చేశామని మహేష్ గౌడ్ తెలియజేశారు. బెంగాల్ లో 93 లక్షల ఓట్లు తీసేశారని విమర్శించారు. ఓటర్ల జాబితా విషయంలో అప్రమత్తంగా ఉండాలని, తెలంగాణలో అలాంటి కుట్రలు జరగకుండా చూసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.



2

## యూపీఎస్సీని చూసి నేర్చుకోండి.. నీట్ పేపర్ లీక్‌పై 'సుప్రీం' వ్యాఖ్య

### పోక్సో కేసు: బండి భగీరథ్‌కు

## ముగిసిన పోలీసు కస్టడీ

**హైదరాబాద్:**

ఫోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీసు కస్టడీ విచారణ ముగిసింది. ఇవాల్టితో 3 రోజుల పోలీసు కస్టడీ గడువు ముగియడంతో విచారణ తర్వాత మల్కాజ్‌గిరి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలిస్తారు. ప్రధానంగా బాధితురాలితో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్‌లలో ఛాటింగ్‌లకు సంబంధించి కొన్ని ఆధారాలను పోలీసులు ఇప్పటికే సేకరించారు. వాటి ఆధారంగానే భగీరథ్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది.



# జూన్ 1న డీకే ప్రమాణస్వీకారం..

## సిద్ధరామయ్య తనయుడికి డిప్యూటీ సీఎం!

### శనివారం కీలకమైన

### సీఎల్‌పీ నేత ఎన్నిక

### ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య

### ఖర్గేను కలిసిన సిద్ధరామయ్య

**న్యూఢిల్లీ: న్యూస్‌వార్ ప్రతినిధి**




కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాతో డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టనుండటం ఖాయమైంది. నాయకత్వ మార్పు నేపథ్యంలో తన కుమారుడు, ఎమ్మెల్యే యతీంద్ర సిద్ధరామయ్యకు ఉపముఖ్య మంత్రి పదవి ఇవ్వాలని పార్టీ అధిష్ఠానాన్ని సిద్ధరామయ్య కోరినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. కీలకమైన సీఎల్‌పీ నేత ఎన్నిక శనివారంనాడు జరుగనుంది. సీఎల్‌పీ నేతగా డీకే ఎన్నికైన అనంతరం ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. జూన్ 1న డీకే సర్కార్ ప్రమాణస్వీకారం చేయనుంది. అంతవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య కొనసాగుతారు. కాగా, మంత్రివర్గ కూర్పుపై ఢిల్లీలో సిద్ధరామయ్య, డీకే పార్టీ అధిష్ఠానంతో వరుస సమావేశాలు జరుపుతున్నారు. ఈ సమావేశంలో సిద్ధరామయ్య తన డిమాండ్లను అధిష్ఠానం ముందుంచినట్టు చెబుతున్నారు. యతీంద్ర సిద్ధరామయ్యకు ఉపముఖ్యమంత్రి పదవిని సిద్ధరామయ్య ఆశిస్తున్నారు. దీనితో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు కేజే జార్జి, జి.పరమేశ్వరలకు క్యాబినెట్‌లో చేటు కల్పించాలని సిద్ధరామయ్య కోరినట్టు తెలుస్తోంది. ఆ ఇద్దరూ కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్ష పదవిని ఆశించడం లేదని ఆయన వివరించినట్టు తెలిసింది.

#### రేపు సీఎల్‌పీ సమావేశం

కాగా, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశం శనివారంనాడు జరుగనున్నట్టు మీడియాతో మాట్లాడుతూ శివకుమార్ తెలిపారు. కేంద్ర నాయకులు వస్తున్నారని, పార్టీ ఎమ్మెల్యేలంతా బెంగళూరులోనే ఉండాల్సిందని కోరామని ఆయన చెప్పారు.

#### ఖర్గేను కలిసిన సిద్ధరామయ్య

మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఆయన నివాసంలో సిద్ధరామయ్య కలిసారు. కర్ణాటక మంత్రులు ప్రియాంక్ ఖర్గే, కేసీ జార్జ్, యతీంద్ర సిద్ధరామయ్య ఆయన వెంట ఖర్గేను కలిసిన వారిలో ఉన్నారు. దీనికి మందు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, విపక్ష నేత రాహుల్ గాంధీని 10 జన్‌పథ్‌లో సిద్ధరామయ్య కలిసారు. మర్యాదపూర్వకంగానే కేంద్ర నేతలను సిద్ధరామయ్య కలిసినట్టు కర్ణాటక కాంగ్రెస్ ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకు సిద్ధరామయ్య తన పదవికి గురువారంనాడు రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఆమోదించేందుకు, మంత్రిమండలిని రద్దు చేసేందుకు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ లాంఛనంగా అంగీకరించారు. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగేంత వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాల్సిందిగా సిద్ధరామయ్యకు గవర్నర్ సూచించారు.

# వందేమాతరంపై మళ్లీ రగడ..

## కేరళ గవర్నర్ అసంతృప్తి

**తిరువనంతపురం: న్యూస్‌వార్ ప్రతినిధి**

కేరళ రాజకీయాల్లో మరోసారి 'వందేమాతరం'పై వివాదం చోటుచేసుకుంది. యునైటెడ్ డెమోకటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) పాలసీ అడ్రస్ సందర్భంగా అసెంబ్లీలో 'వందేమాతరం' గేయాన్ని పూర్తిస్థాయిలో పాడకపోవడంపై గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ శుక్రవారంనాడు అసంతృప్తి వ్యక్తం చేసారు. అసెంబ్లీ నుంచి బయటకు వస్తూ మీడియాతో ఆయన మాట్లాడారు. అధికారిక కార్యక్రమాల్లో గవర్నర్ ఎప్పుడు హాజరైనా సరైన ప్రోటాకాల్ పాటించాల్సి ఉంటుందని అన్నారు. కేరళ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ముందు, తరువాత ఒక బ్యాండ్ టీమ్ 'వందేమాతరం' గేయంలోని మొదటి చరణాలను మాత్రమే ప్లే చేసింది. దీనిపై గవర్నర్ మాట్లాడుతూ, గవర్నర్ ఎప్పుడు హాజరైనా వందేమాతర గేయాన్ని పూర్తిగానే పాడాల్సి ఉంటుందని అన్నారు. 'గేయాన్ని ఆలపించలేదు, ప్లే మాత్రమే చేశారు' అని చెప్పారు. అసెంబ్లీ స్పీకర్ తిరువాంచూర్ రాధాకృష్ణన్‌తో తాను ఇప్పటికే మాట్లాడానని, ఏం జరుగుతోందో చూద్దామని అన్నారు.

#### గవర్నర్‌ను అమానించడమే..

కాగా, ప్రభుత్వ విధానాలపై గవర్నర్ శుక్రవారంనాడు ప్రసంగించిన సమయంలో వందేమాతరం గేయాన్ని పూర్తిస్థాయిలో ఆలపించకపోవడాన్ని బీజేపీ తప్పుపట్టింది. ఇది లోక్‌భవన్, గవర్నర్‌ను అవమానపరచడమేనని పేర్కొంది. గవర్నర్ ఎప్పుడు హాజరైనా జాతీయగేయం వందేమాతరాన్ని పూర్తి స్థాయిలో వినిపించాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలున్నాయని బీజేపీ సీనియర్ నేత, కాలకూట్టం ఎమ్మెల్యే వి.మురళీధరన్ తెలిపారు. అయితే కేరళ ప్రభుత్వం కేంద్రం ఆదేశాలను పాటించలేదన్నారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సమయంలో ఇలా చేయడం జాతీయగేయానికే అవమానమని విమర్శించారు. వీడీ సతీశ్ సారథ్యలోని యూడీఎఫ్ ప్రభుత్వం జమాతే ఇస్లామీ, సీపీఎం అభిప్రాయాలకు తలొగ్గుతోందని ఆరోపించారు. జాతీయగేయం సెక్యులర్ లైన్స్‌లో లేదంటూ ఆ పార్టీలు చేస్తున్న వాదనతో ప్రభుత్వం ఏకీభవించినట్టు స్పష్టమవుతోందని అన్నారు.

# విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి**

మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉన్నతాధికారులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఎదురవుతున్న ఇబ్బందులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటులో అధికారులు, పోలీసులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నియమాలకు విరుద్ధమైన స్థలాలపై ముందుగానే నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు.చివరి నిమిషంలో అభ్యంతరాలు చెప్పొద్దని అధికారులకు మంత్రి సూచించారు. దళిత సంఘాల నాయకులపై అనవసరంగా కేసులు పెట్టొద్దని తెలిపారు. అలాగే ప్రజల భావోద్వేగాలను గౌరవించాల్సి ఉందని పేర్కొన్నారు. అంబేద్కర్, ఫులే, జగ్జీవన్ రామ్ ఆశయాలే ప్రభుత్వానికి మార్గదర్శకమని చెప్పారు. సామాజిక న్యాయమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అభివర్ణించారు. విగ్రహాలు సామాజిక చైతన్యానికి ప్రతీకలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. సమస్యల పరిష్కారంపైనే ప్రధాన దృష్టి పెట్టాల్సి ఉందని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభిప్రాయపడ్డారు.

# అనుమతి లేకుండా నాగ చైతన్య పేరు, ఫొటో వాడటంపై నిషేధం

**న్యూఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి**

తన వ్యక్తిగత హక్కులు, గోప్యతను పరిరక్షించాలని కోరుతూ అక్కినేని నాగ చైతన్య ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలను దుర్వినియోగం చేస్తున్నారని, వాటిని అడ్డుకోవాలని ఢిల్లీ హైకోర్టులో నాగ చైతన్య పిటిషన్ దాఖలు చేశారు. నాగ చైతన్య పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. కోర్టు నాగచైతన్య అభ్యర్థనపై సానుకూలంగా స్పందించింది. నాగ చైతన్య వ్యక్తిత్వ హక్కులు పరిరక్షిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతి లేకుండా నాగ చైతన్య పేరు, ముఖ రూపం, కంఠస్వరం వాణిజ్యపరంగా వాడటంపై నిషేధం విధించింది.

#### కొద్దిరోజుల క్రితం నాగార్జున..

తన వ్యక్తిగత హక్కులకు (పర్సనాలిటీ రైట్స్) భంగం కలిగిస్తున్నారంటూ కొద్దిరోజుల క్రితం ఢిల్లీ హైకోర్టులో సినీ నటుడు అక్కినేని నాగార్జున పిటిషన్ దాఖలు చేశారు. ఓ బట్టల వ్యాపారి దుస్తులపై తన చిత్రాలు, పేరు వాడుతున్నాడని నాగార్జున కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసుపై మే 12వ తేదీన కోర్టు విచారణ జరిపింది. న్యాయస్థానం సదరు వ్యాపారిపై సీరియస్ అయ్యింది. నాగార్జున ఫొటోలను వాణిజ్యపరంగా వాడుకునే అధికారం మీకు ఎవరిచ్చారంటూ కోర్టు నిలదీసింది.వ్యాపారి తరఫు న్యాయవాది శృతి అయ్యర్ వాదనలు వినిపిస్తూ 'ది ఘోస్ట్' సినిమాకు తాము అధికారిక మర్చండైజింగ్ భాగస్వాములమని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి తమకు కేసు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది.

# ఆర్ఎమ్‌యూకి రైళ్ల తయారీ బాధ్యత.. ప్రధానికి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు..

**హైదరాబాద్:**

కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్( కు 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతర సహకారం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు.రాబోయే ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీనిపై సమీక్ష నిర్వహించి, ఆ బాధ్యతను కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు అప్పగిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ఈ ఇంటర్‌సిటీ రైళ్లు 20 కోచ్‌ల కాన్ఫిగరేషన్‌తో, ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్, సురక్షితమైన కోచ్ డిజైన్ వంటి ఆధునిక సదుపాయాలను కలిగి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వీటిని సాధారణంగా సుమారు 300 కిలోమీటర్ల దూరం ఉన్న మార్గాల్లో నడిపిస్తారని తెలిపారు. అలాగే ప్రతి ట్రిప్‌లో చాలా స్టాప్‌లు ఉంటాయని కేంద్ర మంత్రి చెప్పారు.ఇంటర్‌సిటీ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణాలు, నగరాల మధ్య ప్రజలు సులభంగా ప్రయాణించేందుకు ఈ రైళ్లు ఉపయోగపడతాయని అన్నారు. ఇవి తమ సమీప పట్టణాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు. అలాగే ఆరోగ్యం, ఉద్యోగం, ఉపాధి కోసం ప్రయాణించే సామాన్య ప్రజలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

# బయటి సవాళ్లను దీటుగా ఎదుర్కొనే స్థితిలో భారత ఆర్థిక వ్యవస్థ: ఆర్‌బీఐ

**ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి**

అంతర్జాతీయ అనిశ్చితులతో సవాళ్లు ఎదురవుతున్నా భారత ఆర్థిక రంగ మౌలిక అంశాలు దృఢంగా ఉన్నాయని ఆర్‌బీఐ తన తాజా వార్షిక నివేదికలో పేర్కొంది. ఈ ఏడాది దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చెప్పింది. ఈ మేరకు శుక్రవారం భారత రిజర్వ్ బ్యాంకు వార్షిక నివేదికను విడుదల చేసింది.నివేదికలోని వివరాల ప్రకారం, కార్పొరేట్ రంగం, బ్యాంకింగ్ రంగం లాభాల్లో ఉండటంతో పాటు మౌలిక వసతుల కల్పనకు భారత్ పెట్టుబడులు వెచ్చిస్తుండటంతో ఈసారి అభివృద్ధికి ఢోకా ఉండదు. అయితే, ఈ ఏడాది ఆర్థికాభివృద్ధికి అంతర్జాతీయ అనిశ్చితులు కొంత ప్రతిబంధకంగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అభివృద్ధి, ద్రవ్యోల్బణంపై పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రభావం చూపించనున్నాయి. ఫలితంగా ఆర్థిక అభివృద్ధి ఓ మోస్తరు స్థాయిలో ఉండే అవకాశం ఉంది.అయితే, భారత్ పురోగతి సానుకూలంగానే ఉండనుంది. వివిధ దేశాలతో భారత్ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు కూడా ఆర్థికాభివృద్ధికి చోదక శక్తిగా మారనున్నాయి. ఇక ఎల్ నినో ప్రభావంతో ఈసారి భారత్‌లో వ్యవసాయ ఉత్పాదకత తగ్గే అవకాశం ఉందని కూడా ఆర్‌బీఐ తన నివేదికలో అంచనా వేసింది. ఈ వానాకాలం మలిదశలో హిందూ మహాసముద్రంలో పరిస్థితులు కొంత అనుకూలించి ఎల్ నినో ప్రభావం కొంత తగ్గవచ్చని కూడా ఆర్‌బీఐ అంచనా వేసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయంగా ఎరువులు, ఇతర ముడి సరకుల ధరలపై ఒత్తిడి ఉంటుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. ఎరువుల కొరత లేకుండా పలుమార్గాల్లో భారత్ వాటిని సమకూర్చుకుంటున్నందున ఇక్కట్లు తక్కువగా ఉండొచ్చని పేర్కొంది. దేశంలో తగినంత ధాన్యం నిల్వలు, రిజర్వాయర్లల్లో నీటి నిల్వలు ఉండటంతో వ్యవసాయంపై ఎల్ నినో ప్రభావం కొంత తగ్గి ఈ ఏడాది ద్రవ్యోల్బణం అదుపులోనే ఉంటుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. 2026-31 మధ్య కాలానికి ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి పరిమితం చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. డీబీటీ పథకాలు, డొమెస్టిక్ రిటైల్ విభాగంలో డిజిటల్ కరెన్సీని మరింత విస్తరించే యోచనలో తాము ఉన్నట్టు కూడా ఆర్‌బీఐ తెలిపింది.

# యూపీఎస్సీని చూసి నేర్చుకోండి.. నీట్ పేపర్ లీక్‌పై 'సుప్రీం' వ్యాఖ్య

**ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి**

నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు తాజాగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. సివిల్స్ పరీక్షలు నిర్వహించే యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది.కోర్టు విచారణకు ఎన్‌టీఏ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు ఏర్పాటైన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ ఎలా లీక్ అయ్యిందని అన్నారుఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య తలెత్తిందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలనూ సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు.కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది.ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21న నిర్వహించనున్న పరీక్ష కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

# రైతులు, కరెంటు, వ్యవసాయ బంధాన్ని విడదీయలేనిది : నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి**

విద్యుత్ శాఖ అనేది సర్వీస్ డిపార్ట్ మెంట్..అందులో వివిధ కేటగిరీలు ఉండొచ్చునని, ఆర్థిక వ్యవస్థను నడిపే అత్యంత కీలకమైనది విద్యుత్ రంగం అని బిఆర్ఎస్ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. రైతాంగ శ్రేయస్సుకు సంబంధించిన ప్రధాన అంశమిది అని ప్రభుత్వ దరఖాస్తును తిరస్కరించాలని కోరుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆదరబాదరాగా 2వ తేదీ నుంచి అమలు చేయడం ఎలా సమంజసం అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర విచారణ చేసి వివరణ తీసుకుంటే మంచిది అని సూచించారు. మిగతా రంగాలకు చోదక శక్తిగా ఉపయోగపడుతున్న విద్యుత్ రంగం గ్రామీణ ప్రాంత ప్రజల, రైతుల సంక్షేమాన్ని పరిగణంలోకి తీసుకోవాలని, రైతులు, కరెంటు, వ్యవసాయ బంధాన్ని విడదీయలేనిదని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.



సమైక్య పాలనలో విద్యుత్ సంక్షోభాన్ని అనుభవించామని, ఆనాడు గ్రావిటీ ద్వారా నీళ్లు తరలించే ప్రాజెక్టులు కట్టి ఉంటే బాగుండేదని నిరంజన్ రెడ్డి అన్నారు. దేశంలోనే ఆహార ఉత్పత్తి తెలంగాణ నుంచే జరుగుతోందని, 2014 నాటికి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 7,778 మె.వా. ఉండేదని చెప్పారు. 2023 ఆగస్టు నాటికి 18,756 మె.వా. విద్యుత్ సామర్థ్యానికి, గరిష్ట విద్యుత్ డిమాండ్ 6666 మె.గా. ఉంటే 15497 మె.గా. కి, తలసరి విద్యుత్ వినియోగం 1,196 నుంచి యూనిట్లకు తీసుకెళ్లామని అన్నారు. అవసరాలకు అనుగుణంగా వివిధ స్థాయిల విద్యుత్ సబ్ స్టేషన్లు పెంచామని, డిస్కంల సంఖ్యను 2138 నుంచి 3210 కి, పవర్ ట్రాన్స్ ఫార్మర్లను 3272 నుంచి 5690కి, డిస్ట్రిబ్యూటర్ ట్రాన్స్ ఫార్మర్లను 46937 నుంచి 8.62 లక్షలకు, వ్యవసాయ కనెక్షన్లు 19 నుంచి 28 లక్షల పై చిలుకుకు తీసుకెళ్లామని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

# వనపర్తిలో బొలెరోను ఢీకొట్టిన లారీ: ఐదుగురు మృతి

**కొత్తకోట:**

వనపర్తి జిల్లా కొత్తకోట మండల పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముమ్మళ్ల పల్లి గ్రామ శివారులో జాతీయ రహదారి 44 పై ఆగి ఉన్న బొలెరోను వెనక నుండి లారీ అతివేగంగా ఢీకొట్టడంతో ఐదుగురు మృతి చెందారు. ఘటనా స్థలంలో ముగ్గురు దుర్మరణం చెందగా గాయపడడంతో ఇద్దరు చికిత్స పొందుతూ చనిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



న్యూస్ వార్ వార్తా పత్రిక

**సంపాదకీయం...**

# గ్రామీణ ప్రజల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తి

గ్రామీణ వాస్తవ పరిస్థితులు, అధికారిక ప్రకటనల మధ్య పెరుగుతున్న వ్యత్యాసం కాంగ్రెస్‌కు రాజ కీయంగా ప్రమాద సంకేతాలుగా మారుతోంది. వ్యవసాయ విద్యుత్ సరఫరా విషయంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు దాదాపు నిరంతరాయ ఉచిత విద్యుత్ అందిస్తూ వ్యవసాయ ఉత్పాదకత పెంచ గలిగింది. కానీ ప్రస్తుతం కీలక సాగు కాలాల్లో అనూహ్య విద్యుత్ అంతరాయాలు పెరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల మోటార్లు దెబ్బతినడం, పంటలు ఎండిపోవ డం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వాల అప్పులు, పెరిగిన డిమాండ్ వంటి కారణాలు ఉన్నప్పటికీ, ఉత్పత్తి– ప్రసార మౌలిక వసతుల విస్తరణలో వేగం లేకపోవడం ప్రణాళికా వైఫల్యానికే సంకేతం. కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు– రంగారెడ్డి వంటి ప్రాజెక్టులను వారసత్వంగా స్వీకరించినా, వాటి పురోగతి ఆశించినంత వేగంగా లేదు. అంతర్రాష్ట్ర జల వివాదాలు, నిధుల కొరత వంటి సమస్యలు ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ప్రాధాన్యత తగ్గుతోందన్న భావన పెరుగుతోంది. దక్షిణ భారతదేశంలో నీటి భద్రత కీలకమైన సమ యంలో ఈ మందగమనం భవిష్యత్‌లో తీవ్రమైన ప్రభావాలు చూపే అవకాశం ఉంది. రాజకీయ ప్రచారంలోనూ కాంగ్రెస్ వెనుకబడుతోంది. ఉద్యోగ నియామకాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పట్టణ సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రధానంగా ప్రస్తావిస్తున్నప్పటికీ, గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు, నిల్వల కష్టాలు, పూర్తి కాని కాల్వలే ప్రజల మదిలో నిలుస్తున్నాయి. ూశ్రీంశీ =ఘుఎ – రూబియో పర్యటనలో ఆంతర్యం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్న వేళ, గ్రామీణ ప్రజల్లో అసంతృప్తి క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా విద్యుత్ సరఫరా, రైతు ధాన్యం కొనుగోలు, సాగునీటి రంగాల్లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఏర్పడిన ప్రమాణాలను కొనసాగించడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. అదే సమయంలో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) అమలు, ధాన్యం లిఫ్టింగ్ వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం తెలంగాణ వంటి అధిక ఉత్పత్తి రాష్ట్రాలపై అదనపు భారాన్ని మోపుతున్నదన్న వాదనకూ బలం ఉంది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు హామీలతో రైతు కేంద్రిత పాలనను వాగ్దానం చేసింది. సంక్షేమ పథకాల అమలులో కొంత పురోగతి కనిపించినప్పటికీ, వ్యవసాయానికి సంబంధించిన కీలక రంగాల్లో నాణ్యమైన పరిపాలన లోపించడం ప్రతిపక్షాలకు ఆయుధంగా మారింది. గ్రామీణ వాస్తవ పరిస్థితులు, అధికారిక ప్రకటనల మధ్య పెరుగుతున్న వ్యత్యాసం కాంగ్రెస్‌కు రాజకీయంగా ప్రమాద సంకేతాలుగా మారుతోంది. వ్యవసాయ విద్యుత్ సరఫరా విషయంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు దాదాపు నిరంతరాయ ఉచిత విద్యుత్ అందిస్తూ వ్యవసాయ ఉత్పాదకత పెంచగలిగింది. కానీ ప్రస్తుతం కీలక సాగు కాలాల్లో అనూహ్య విద్యుత్ అంతరాయాలు పెరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల మోటార్లు దెబ్బతినడం, పంటలు ఎండిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వాల అప్పులు, పెరిగిన డిమాండ్ వంటి కారణాలు ఉన్నప్పటికీ, ఉత్పత్తి– ప్రసార మౌలిక వసతుల విస్తరణలో వేగం లేకపోవడం ప్రణాళికా వైఫల్యానికే సంకేతం. ఉచిత విద్యుత్ రాజకీయంగా అవసరమైనదే అయినా, దానికి తగిన మౌలిక వసతులు లేకపోతే రైతులే నష్టపోతారు. పల్లెల ఆర్థిక పరిపుష్టికి బక్రీద్ భరోసా ధాన్యం కొనుగోలు వ్యవస్థలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ప్రభుత్వం లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ప్రకటిస్తున్నప్పటికీ, గ్రామీణ స్థాయిలో రైతులు వారాల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు. గన్నీ బ్యాగుల కొరత, లిఫ్టింగ్‌లో ఆలస్యం, అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం, రవాణా– కూలీ ఖర్చుల పెరుగుదల రైతులపై అదనపు భారంగా మారాయి. కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు కూడా చోటుచేసుకున్నాయి. రుణమాఫీ వంటి చర్యలు కొంత ఉపశమనం కలిగించినా, కొనుగోలు వ్యవస్థలో గత ప్రభుత్వ కాలంలో ఉన్న సమన్వయం కనిపించడం లేదు. అయితే ఈ సమస్యల్లో కేంద్ర ప్రభుత్వ బాధ్యతను కూడా విస్మరించలేం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు కేంద్రాన్ని అదనపు ధాన్యం లిఫ్టింగ్ కోసం కోరారు. ఎఫ్‌సిఐ పరిమిత కొనుగోళ్లవల్ల రాష్ట్రం అదనపు నిల్వలు, వడ్డీ భారాన్ని భరించాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. కేంద్రం ఎంఎస్‌పిలను ప్రకటిస్తున్నప్పటికీ, అనేక పంటల విషయంలో ఉత్పత్తిలో 30 శాతం కూడా కొనుగోలు చేయకపోవడం వల్ల తెలంగాణ వంటి మిగులు ఉత్పత్తి రాష్ట్రాలు భారీ నిల్వల భారాన్ని మోస్తున్నాయి. మొక్కజొన్న, జొన్న వంటి పంటలకు మద్దతు ధర పరిధి విస్తరణ, కొనుగోలు పరిమితుల తొలగింపు వంటి రాష్ట్రాల డిమాండ్లపై కేంద్రం స్పందన మందగించడం రైతులను మధ్యవర్తుల చేతుల్లోకి నెడుతోంది. సాగునీటి రంగంలోనూ మందగమనం స్పష్టంగా కనిపిస్తోంది. బిఆర్ఎస్ హయాంలో భారీ ఎత్తున చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు వివాదాలకు గురైనప్పటికీ, కొత్త ఆయకట్టులను సృష్టించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు– రంగారెడ్డి వంటి ప్రాజెక్టులను వారసత్వంగా స్వీకరించినా, వాటి పురోగతి ఆశించినంత వేగంగా లేదు. అంతర్రాష్ట్ర జల వివాదాలు, నిధుల కొరత వంటి సమస్యలు ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ప్రాధాన్యత తగ్గుతోందన్న భావన పెరుగుతోంది. దక్షిణ భారతదేశంలో నీటి భద్రత కీలకమైన సమయంలో ఈ మందగమనం భవిష్యత్‌లో తీవ్రమైన ప్రభావాలు చూపే అవకాశం ఉంది. రాజకీయ ప్రచారంలోనూ కాంగ్రెస్ వెనుకబడుతోంది. ఉద్యోగ నియామకాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పట్టణ సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రధానంగా ప్రస్తావిస్తున్నప్పటికీ, గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు, నిల్వల కష్టాలు, పూర్తి కాని కాల్వలే ప్రజల మదిలో నిలుస్తున్నాయి. బిఆర్ఎస్ ప్రభుత్వ అప్పులను కాంగ్రెస్ తరచూ ప్రస్తావిస్తున్నప్పటికీ, కేంద్రం కొనుగోలు విధానాల వైఫల్యాన్ని దక్షిణ రాష్ట్రాల వేదికలపై మరింత బలంగా ఎత్తిచూపాల్సిన అవసరం ఉంది. నిజానికి పరిస్థితులు పూర్తిగా ఆశాజనకంగా లేవు.



భారీ అప్పులు, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, జాతీయ ఎంఎస్‌పి విధాన పరిమితులు రాష్ట్రంపై ప్రభావం చూపుతున్నాయి. అయినప్పటికీ విద్యుత్, కొనుగోలు, సాగునీటి రంగాల్లో నాణ్యమైన పరిపాలనలో కనిపిస్తున్న లోపాలు గ్రామీణ వ్యతిరేకతకు దారితీస్తున్నాయి. కేంద్రం తగిన స్థాయిలో ధాన్యం లిఫ్టింగ్ చేయకపోవడం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. దక్షిణ భారత రాజకీయాల్లో కాంగ్రెస్ తన ప్రాధాన్యాన్ని విస్తరించాలంటే తెలంగాణలో విజయవంతమైన పరిపాలనను నిరూపించుకోవాల్సిందే. అందుకోసం రాజకీయ ఆరోపణలకు అతీతంగా పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, మౌలిక వసతులపై పెట్టుబడులు పెంచడం, కొనుగోలు వ్యవస్థను సమర్థవంతం చేయడం, ఎంఎస్‌పి, ధాన్యం లిఫ్టింగ్ కేంద్రాన్ని నిరంతరం ఒత్తిడి చేయడం అత్యవసరం. లేకపోతే 2023లో వచ్చిన ప్రజా తీర్పు క్రమంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. దక్షిణ భారత గ్రామీణ సమాజం మాటలకన్నా చేతలపట్ల ఆసక్తి చూపుతుంది. ప్రతి విద్యుత్ అంతరాయం, ప్రతి ఆలస్యమైన కొనుగోలు కేంద్రం, ప్రతి లిఫ్ట్ కాని ధాన్యపు టన్ను రాబోయే రాజకీయ ఫలితాలను ప్రభావితం చేసే శక్తిగా మారవచ్చు.

# ఎన్టీఆర్ అంటే పేదలకు భరోసా.. రైతుకు నేస్తం


## ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలి

## యువతను రాజకీయాల్లో ప్రోత్సహించిన మహోన్నతుడు

## మహానాడు తీర్మానంలో చంద్రబాబు డిమాండ్

**అమరావతి**

మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు తెలుగుజాతి సెంటిమెంట్ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేందప్రభుత్వాన్ని అడుగుతానని పేర్కొన్నారు. గురువారం రెండోరోజు మంగళగిరిలో జరుగుతున్న మహానాడు వేడుకలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, టీడీపీ సీనియర్ నేతలు, మంత్రులు నివాళులు అర్పించారు. 1,875 క్లస్టర్ల నుంచి మహానాడుకు టీడీపీ నేతలు, శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మహానాడులో ఆయనకు నివాళి అర్పించే తీర్మానంపై సీఎం ప్రసంగించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మహానాడులో ప్రతిపాదించారు. దేశ అత్యున్నత పౌర పురస్కారంతో ఎన్టీఆర్‌ను సత్కరించాలని సీఎం చంద్రబాబు కోరారు. ని చెప్పుకొచ్చారు. ఎన్టీఆర్ పాలన రైతులకు అండ, మహిళలకు భరోసా, కార్మికులకు అభయం.. యువతకు దిక్సూచి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 1983లో రాజకీయాల్లో యువతకు ఎన్టీఆర్ అవకాశాలు కల్పించారని ప్రస్తావించారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించారని.. భవిష్యత్తులో సమర్థ నాయకత్వం ఉండేలా భవిష్యత్తు కార్యాచరణ చేపడుతున్నామని అన్నారు. నిన్నటి మహానాడులో జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు లోకేశ్ ప్రతిపాదించిన 33 శాతం రిజర్వేషన్‌ను మనమే ప్రారంభిద్దామని తెలిపారు. 33 శాతం రిజర్వేషన్లను మహిళలకు కల్పించాలని కేంద్రాన్ని మరోమారు కోరదామని అన్నారు. తెలుగు వెలుగుగా నిలిచిన స్వర్గీయ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనేది మన అందరి డిమాండ్ అని చెప్పారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోయారని ఉద్ఘాటించారు. సామాన్యుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించారన్నారు. తెలుగు ప్రజల ఐక్యత కోసం పనిచేసిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని ఉద్ఘాటించారు. భారత రాజకీయ చరిత్రలో ఆయన సేవలు విశిష్టం, అపూర్వమని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజల మనోభావాలను గుర్తించి ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని మహానాడు ఏకగ్రీవంగా తీర్మానిస్తోందని తెలిపారు. ఇది మనందరి ఆకాంక్ష, ప్రతీ తెలుగువారి కోరిక అని చెప్పారు. దేశరాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికిన మహోన్నత నాయకుడికి భారతరత్న ఇవ్వాలని కేందప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు కోరారు.ఎన్టీఆర్ అంటే అన్నివర్గాలు ప్రేమించే నాయకుడని ప్రశంసించారు. సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి సినీ జీవితంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఎదిగారని ప్రశంసించారు. ఎన్టీఆర్ మళ్లీ పుడితే తప్ప ఆయన క్రమశిక్షణ, ఆయన ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదని అన్నారు. ఆయన ఎక్కడ ఉన్నా తెలుగువారి ఆత్మగౌరవం కోసమే జీవించారని తెలిపారు. రైతుబిడ్డ నుంచి సినిమాల్లో శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రల వరకూ, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారని ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ పేరు తలుచుకుంటేనే పట్టుదల, ఆత్మవిశ్వాసం వస్తుందని చెప్పారు. ఆయన పేరు తలచుకుని సంకల్పం చేస్తే చాలు దానికి తిరుగు ఉండదన్నారు. దేశ రాజకీయాల్లో ఆయన



ఉద్యోగిగా మొదలై, సినిమా స్టార్‌గా ఎదిగి, ప్రజల కోసం పార్టీ పెట్టి సీఎంగా ఎదగడం ఎన్టీఆర్‌కే సాధ్యమని కీర్తించారు. ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని ఎన్టీఆర్ ఎప్పుడూ వీడలేదని తెలిపారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అనేదే ఎన్టీఆర్ సిద్ధాంతమని పేర్కొన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోతారని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ జయంతి తెలుగువారందరికీ పండుగ రోజు అని తెలిపారు. లాంటి నాయకుడు మరొకరు లేరని.. ఆయన మొదట సబ్‌రిజిస్ట్రార్‌గా ఉద్యోగంలో చేరారని ప్రస్తావించారు. నీతి నిజాయితీతో ఆయన సినిమాల్లోకి వచ్చారని.. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి అయ్యారని వ్యాఖ్యానించారు. ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిందని.. కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించిందని సీఎం చంద్రబాబు తెలిపారు.

# రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి

## ఇది గుర్తించి అడుగులు వేసిన నేత చంద్రబాబు

## కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరంకు మహర్దశ

## కేంద్ర సాయంపై మహానాడులో కేంద్రమంత్రి పెమ్మసాని

**అమరావతి,**

రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందాలంటే కేంద్రం సహకారం తప్పనిసరి అని నమ్మిన నాయకుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి కోసం రూ.15,000 కోట్లు కేంద్ర బ్జడెట్‌లో కేటాయించిందని వివరించారు. చరిత్రలో ఎవరూ కదిలించలేని విధంగా రాజధాని అమరావతికి చట్టబద్ధత తీసుకొచ్చామని గుర్తు చేశారు. గురువారం టీడీపీ మహానాడులో రాష్ట్రానికి కేంద్ర సహాయం అనే తీర్మానంపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. రెండేళ్లలో రూ.20,000 కోట్ల రైల్వే ప్రాజెక్టులు రాష్ట్రానికి తీసుకొచ్చామని పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు. 316 ఆర్వోబీ పాంట్లు,16 వందే భారత్ రైళ్లు, 73 అమృత్ భారత్ స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.2,500 కోట్లతో అమరావతిలో రైల్వే ప్రాజెక్టు, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సాధించామని చెప్పారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆ ఐదేళ్లలో భోగాపురం ఎయిర్ పోర్టు కోసం కేవలం రూ.600 కోట్లు ఖర్చు చేస్తే... కూటమి ప్రభుత్వం రూ.4,000 కోట్లు ఖర్చు చేసి ప్రారంభానికి సిద్ధం చేసిందని వివరించారు. పూర్వోదయ పథకం కింద రాయలసీమలో రూ.40 వేల కోట్లతో హార్టీకల్చర్ హబ్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. గూగుల్ నుంచి గ్రీన్ హైడ్రోజన్ వరకు ఆంధప్రదేశ్ ప్రత్యేక ముద్ర వేసిందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు కోసం కేంద్రం రూ.11,400 కోట్లు సాయం చేసిందని వివరించారు. ఉక్కును కరిగించవచ్చు కానీ.. ఆంధ్రుల సంకల్పాన్ని వైఎస్ జగన్ కరిగించలేడన్నారు. సంకెళ్లతో అమరావతిని గొడ్డలి పార్టీ బంధిస్తే.. సంకల్పంతో అమరావతిని సాధించామని స్పష్టం చేశారు. గోదావరి నీళ్లు సముద్రంలో కాకుండా రైతు జీవితాల్లో కలవాలనే లక్ష్యంతో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. 2014–19లోనే పోలవరం పనులు 70 శాతం పూర్తి చేశామని.. కానీ గత వైసీపీ ప్రభుత్వం కేవలం 5 శాతం పనులు మాత్రమే చేసిందని సోదాహరణంగా ఆయన వివరించారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి 30 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు.నాడు పంచాయతీ రాజ్ శాఖమంత్రిగా నారా లోకేశ్.. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయడానికి ఎంతో కృషి చేశారని పెమ్మసాని చంద్రశేఖర్ గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం పథకాలు సద్వినియోగ పరుచుకోవడంలో విఫలమయిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో రూ.12,000 కోట్లు చెల్లించి సుమారు 82 కేంద్ర పథకాలను పునరుద్ధరిం చామని వివరించారు. అమృత్ స్కీమ్ కింద కొత్తగా 2 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లు ఇచ్చామన్నారు. నీళ్లు అందించడం సంక్షేమం కాదని.. ప్రభుత్వాల బాధ్యత అని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుర్తించలేక పోయారని పేర్కొన్నారు.

# పార్టీలో మహిళా నాయకత్వానికి ప్రోత్సాహం

## పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలకు శ్రీకారం

## 11లక్షల మంది మహానాడు కోసం రిజిస్టర్ చేశారు

## మహానాడులో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన లోకేశ్

**అమరావతి,**

11 లక్షల మంది పార్టీ క్యాడర్ హాజరై.. మహానాడు మరో సంచలన రికార్డు నమోదు చేసుకుందని టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ అటెండెన్స్‌లో వారంతా నమోదు చేయించుకున్నారని వివరించారు. గురువారం మహానాడులో మంత్రి లోకేశ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామన్నారు. పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకురావాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచి పార్టీలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. పదవీకాల పరిమితిని తీసుకు వచ్చింది తామేనని ఈ సందర్భంగా నారా లోకేశ్ గుర్తు చేశారు. ఎన్నికల గురించి కాదు.. సిద్ధాంతపరంగా తాము సంస్కరణలు తీసుకువస్తున్నామని చెప్పారు. గత మహానాడులో తాను ఆరు శాసనాలు గురించి చెప్పానని ఈ సందర్భంగా నారా లోకేశ్ గుర్తు చేశారు. ఇప్పుడు 'నా తెలుగుదేశం.. నా బాధ్యత' అని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎవరైనా తన ప్రసంగం ముందు నా తెలుగుదేశం.. నా బాధ్యత అని చెప్పాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఆలోచించి అందుకు అనుగుణంగా తాము ముందుకు వెళ్లాల్సిఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌లాగా తాము ఏకపక్షంగా ఏకగ్రీవాలు చేసుకోమని చెప్పారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తామన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికలలో నామినేషన్ల పేపర్లు లాక్కుని ఎలా వ్యవహరించారనేది అందరం చూశామన్నారు. అందుకనే ఆయన ఏకగ్రీవాలు చేస్తే ఊరుకోమన్నారని చెబుతున్నారని తెలిపారు. నాడు ఆయన చేశాడు కాబట్టే నేడు భయపడుతున్నారంటూ జగన్ వైఖరిని ఈ సందర్భంగా లోకేశ్ ఎండగట్టారు. డీఎస్సీ పరీక్షలు, నియామకాలు పూర్తయిన ఆరు నెలలు తర్వాత అందులో అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించడం ఏమిటని నారా లోకేశ్ సందేహం వ్యక్తం చేశారు. ఆయనకు ఇప్పుడు ట్యూబ్ లైట్ వెలిగినట్లుందంటూ వ్యంగ్యంగా అన్నారు. అప్పట్లోనే కోర్టులో డీఎస్సీపై జగన్ ఎన్నో కేసులు వేయించారని గుర్తు చేశారు. అన్ని పిటిషన్లను కోర్టు కొట్టివేసిందని.. కానీ మమ్మల్ని ఎక్కడా తప్పు పట్టలేదని నారా లోకేశ్ వివరించారు. ఈ అంశంపై దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు తాను సవాల్ విసిరానని లోకేశ్ గుర్తు చేశారు. దీనిపై జగన్ స్పందిస్తే బాగుంటుందన్నారు. ఒక్క టీచర్ కానీ.. అధికారి కానీ డీఎస్సీపై ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. డీఎస్సీపై నాకు కానీ, ఏ అధికారికి గానీ ఒక్క రూపాయి అయినా ఇచ్చినట్లు నిరూపించాలని జగన్ పార్టీలోని నేతలను ఈ సందర్భంగా లోకేశ్ డిమాండ్ చేశారు. లెవన్ టీమ్ కెప్టెన్‌కు దమ్ముంటే నిరూపించాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు లోకేశ్ సూటిగా సవాల్ విసిరారు. జగన్.. ఆయన కుటుంబ చరిత్రను తవ్వి తీయించారన్నారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

# పంట అవశేషాలను కాల్చవద్దు -- నేల ఆరోగ్యాన్ని కాపాడండి;

**- రైతులకు మరికల్ మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి ;**

**- మండల వ్యవసాయ అధికారి రెహమాన్ ;**

మరికల్ , మే 29 ; పంట కోత అనంతరం పొలాలలో మిగిలిపోయే వరి, గోధుమ, మొక్కజొన్న తదితర పంటల గడ్డి మరియు అవశేషాలను తగలబెట్టడాన్ని “పంట అవశేషాల దహనం” అంటారు. పొలాలను త్వరగా శుభ్రం చేయడానికి ఈ పద్ధతి ఉపయోగిస్తున్నప్పటికీ, ఇది నేల ఆరోగ్యం, పర్యావరణం మరియు భవిష్యత్ వ్యవసాయ ఉత్పాదకతపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు చూపుతుందని మరికల్ మండల వ్యవసాయ అధికారి తెలిపారు. పంట అవశేషాలను ం వల్ల నేలలో ఉండే విలువైన సేంద్రియ కార్బన్ పూర్తిగా నశిస్తుంది. సేంద్రియ పదార్థం నేల సారవంతం, నీటి నిల్వ సామర్థ్యం, నేల నిర్మాణం మరియు సూక్ష్మజీవుల కార్యకలాపాలకు ఎంతో అవసరం. దీని వల్ల నేల సారహీనంగా మారి, క్రమంగా నేల నాణ్యత క్షీణిస్తుంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా నేలలో ఉండే ప్రయోజనకరమైన బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వానపాములు మరియు ఇతర సూక్ష్మ జీవులు నశిస్తాయి. ఇవి పోషకాల చక్రం, నత్రజని స్థాపన మరియు సేంద్రియ పదార్థాల విచ్ఛిన్నంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ జీవ వ్యవస్థ దెబ్బతినడంతో నేల ఉత్పాదకత తగ్గిపోతుంది. పంట అవశేషాలను కాల్చడం వల్ల ప్రధాన పోషకాలు కూడా నష్టపోతాయి. ముఖ్యంగా నత్రజని ఎక్కువగా వాతావరణంలోకి ఆవిరైపోతుంది. గంధకం వాయువుల రూపంలో నష్టపోతుంది. ఫాస్ఫరస్ మరియు పొటాషియం కూడా కొంత మేర నష్టపోతాయి. ఫలితంగా రైతులు అధిక మొత్తంలో రసాయన ఎరువులు వాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పదేపదే పంట గడ్డి కాల్చడం వల్ల నేల నిర్మాణం దెబ్బతిని, నేల గట్టిపడి కుదించుకుపోతుంది. నేల కణాల కలయిక తగ్గిపోవడంతో నీరు భూమిలోకి ఇంకే సామర్థ్యం తగ్గి, నేల కోత ప్రమాదం పెరుగుతుంది. దీని ప్రభావం వేర్ల పెరుగుదలపై కూడా పడుతుంది. సాధారణంగా పంట అవశేషాలు మల్చ్‌లా పనిచేసి నేలలో తేమను నిల్వ ఉంచుతాయి. కానీ వాటిని కాల్చడం వల్ల నేల త్వరగా ఆరిపోవడం, బాష్పీభవనం పెరగడం మరియు నీటిపారుదల అవసరం అధికమవడం జరుగుతుంది. కాల్చిన పొలాల్లో నేల ఉష్ణోగ్రత ఆకస్మికంగా పెరగడం వల్ల నేల ఉపరితల జీవావరణం దెబ్బతింటుంది. ఇది విత్తనాల మొలక, వేర్ల అభివృద్ధి మరియు పంట ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పంట గడ్డి కాల్చడం వల్ల వాయు కాలుష్యం, పొగమంచు మరియు గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారం పెరుగుతుంది. ముఖ్యంగా కార్బన్ డయాక్సైడ్ (సిఒ2), మీథేన్ (సి హెచ్ 4), నైట్రస్ ఆక్సైడ్ (ఎన్2ఒ) వంటి వాయువులు విడుదలై పర్యావరణానికి హానికరంగా మారుతున్నాయి. అదేవిధంగా, మానవుల్లో శ్వాసకోశ సమస్యలు కూడా పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా సుస్థిర పద్ధతులను అనుసరించాలని సూచించారు. మల్చింగ్ ద్వారా పంట అవశేషాలను పొలం ఉపరితలంపైనే వదిలివేయడం, కంపోస్టింగ్ ద్వారా సేంద్రియ ఎరువుగా మార్చడం, మట్టిలో కలపడం ద్వారా సేంద్రియ పదార్థాన్ని పెంచడం వంటి పద్ధతులు ఉపయోగకరమని తెలిపారు. అలాగే హ్యాపీ సీడర్, సూపర్ సీడర్ యంత్రాల వినియోగంతో పంట అవశేషాలను కాల్చకుండా విత్తనాలు వేయవచ్చని వివరించారు. బయో–డీకంపోజర్ స్ప్రేలు వాడటం ద్వారా పంట అవశేషాలు సహజసిద్ధంగా త్వరగా కుళ్లిపోతాయని సూచించారు. స్వల్పకాలంలో సమయం మరియు శ్రమ ఆదా కోసం పంట గడ్డి కాల్చడం రైతులకు ఉపయోగకరంగా కనిపించినప్పటికీ, దీని వల్ల దీర్ఘకాలంలో నేల సారవంతం, సూక్ష్మజీవుల జీవవ్యవస్థ మరియు వ్యవసాయ సుస్థిరత తీవ్రంగా దెబ్బతింటుందని మరికల్ మండల వ్యవసాయ అధికారి తెలిపారు. కాబట్టి రైతులు పంట అవశేషాలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతులను పాటించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు.

# మక్తల్ పోలీస్ స్టేషన్ కొత్త ఎస్ఐగా పి. రాజు బాధ్యతలు

మక్తల్: మక్తల్ పోలీస్ స్టేషన్‌లో కొత్త స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఎస్ఐ పి. రాజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన దామరగిద్ద ఎస్ఐగా విధులు నిర్వహించిన తర్వాత ఈ బాధ్యతకు బదిలీ అయ్యారు. ముందుగా మక్తల్‌లో ఎస్ఐగా ఉన్న భాగ్యలక్ష్మి రెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ పి. రాజు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గారిని ఎస్పీ కార్యాలయంలో పూలతో మర్యాదగా కలిశారు. జిల్లా ఎస్పీ గారు నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు మరియు మక్తల్ మండలం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి శాంతి, భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఎస్ఐ పి. రాజు మాట్లాడుతూ, మక్తల్ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ సేవలు అందిస్తూ, ఎలాంటి సమస్యలైనా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని ప్రజలకు సూచించారు. గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం, పేకాటా మరియు గంజాయి రవాణా, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, యువతను చట్టవిరుద్ధ కార్యకలాపాల నుంచి దూరంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. మక్తల్ పోలీస్ స్టేషన్ తరఫున, సంబంధిత అంశాలపై స్థానిక ప్రజలతో సమావేశాలు మరియు ప్రజాసంపర్క కార్యక్రమాలు త్వరలో నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు.

# మైనర్ డ్రైవింగ్‌పై మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

మైనర్‌ల డ్రైవింగ్‌ను అరికట్టేందుకు మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ డ్రైవ్‌లో వాహనాలు నడుపుతున్న మైనర్‌లను గుర్తించి చర్యలు తీసుకున్నారు. డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్‌ల తల్లిదండ్రులను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. చిన్న వయస్సులో వాహనాలు నడపడం వల్ల సంభవించే ప్రమాదాలు, చట్టపరమైన




ఇబ్బందులు, ప్రాణనష్టం వంటి అంశాలపై వారికి అవగాహన కల్పించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం తల్లిదండ్రుల నిర్లక్ష్యంగా పరిగణించబడుతుందని పోలీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మైనర్ డ్రైవింగ్ సమాజానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. అనుభవం లేకుండా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశముందని తెలిపారు. తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించి తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

# నాంపల్లిలోని ఫర్టిలైజర్ షాప్‌లపై అధికారుల ఆకస్మిక తనిఖీలు

**నాంపల్లి మే 29 (న్యూస్ వార్)**

వానాకాలం ప్రారంభం అవుతున్న సందర్భంగా నాంపల్లి మండల పరిధిలో వ్యవసాయ శాఖ అధికారులు,పోలీస్ శాఖ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, లైసెన్సులు మరియు సంబంధిత రికార్డులను పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి బండారు శివ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నకిలీ, గడువు ముగిసిన లేదా అనుమతి లేని విత్తనాల విక్రయాలను జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సిడ్ యాక్ట్ 1966 మరియు సంబంధిత నిబంధనల ప్రకారం ప్రతి విత్తన విక్రేత తప్పనిసరిగా రికార్డులు సక్రమంగా నిర్వహించాలని,బిల్ బుక్స్ మరియు స్టాక్ రిజిస్టర్లు అట్టెస్టేషన్ చేయించుకోవాలని సూచించారు. సబ్ ఇన్స్పెక్టర్ లింగారెడ్డి మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా నిబంధనలు ఉల్లంఘించి విత్తన వ్యాపారం చేసే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. బిల్లు తీసుకోవడం ద్వారా విత్తనాల కంపెనీ



వివరాలు మరియు భవిష్యత్తులో ఏవైనా సమస్యలు ఎదురైతే పరిష్కారం పొందేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ అధికారులు మరియు పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు

## ఎంజియూలో అక్రమ ఔట్‌సోర్సింగ్ నియామకాలపై విచారణ జరిపించాలి

## ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు బిఆర్ఎస్వి వినతి

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఇటీవల చేపట్టిన ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకులు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ జిట్టా బాలకృష్ణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బిఆర్ఎస్వి యూనివర్సిటీ అధ్యక్షులు వాడపల్లి నవీన్ నేతృత్వంలో విద్యార్థి సంఘ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో చైర్మన్‌ను కలిసి విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ నియామకాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఆరోపించారు. రోస్టర్ రిజర్వేషన్ విధానాన్ని పూర్తిగా పక్కనబెట్టారని మండిపడ్డారు. నియామకాలకు సంబంధించి ఎలాంటి పత్రికా ప్రకటనలు (నోటిఫికేషన్లు) సరైన విధంగా ఇవ్వలేదని తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువతకు అవకాశం లేకుండా ఈ ప్రక్రియను ముగించారని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఈ అంశంపై యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ (వీసీ), రిజిస్ట్రార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా






అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతోనే, ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి పూర్తి వివరాలను సమర్పించినట్లు వారు పేర్కొన్నారు. గతంలో నవీన్ మిట్టల్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న సమయంలో కూడా రోస్టర్ రిజర్వేషన్, పత్రికా ప్రకటనలు లేకుండా 33 మందిని డైలీ వేజ్ ఉద్యోగులుగా అక్రమంగా నియమించారు. ప్రస్తుతం చేపట్టిన నియామకాలలో కూడా నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి, 100కు పైగా అక్రమ నియామకాలకు తెరలేపారని తెలిపారు.

**ఏజెన్సీని బ్లాక్‌లిస్ట్ లో పెట్టాలి..**

అక్రమాలకు పాల్పడిన సదరు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఆ ఏజెన్సీకి యూనివర్సిటీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనులు ఇవ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరిగిన నియామకాలను పూర్తిగా రద్దు చేయాలి. తిరిగి పారదర్శకంగా నోటిఫికేషన్ విడుదల చేసి, అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి, ప్రతిభా ప్రాతిపదికన నాణ్యత కలిగిన విద్యావంతులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

**చైర్మన్ సానుకూల స్పందన..**

విద్యార్థుల ఫిర్యాదును స్వీకరించిన తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ జిట్టా బాలకృష్ణ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ ఔట్‌సోర్సింగ్ నియామకాల అంశంపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా యూనివర్సిటీ అధికారులతో చర్చిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు విద్యార్థి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పోలగొని శివ, రాజేష్, యశ్వంత్, రామ్, జితేందర్, సంజీవ,పలువురు నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యం

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

## ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక’లో ఇందిరమ్మ చీరల పంపిణీ.. 64 మందికి కుక్క పిల్లల దత్తత

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. అంతేకాక ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 64 కుక్కల ప్రేమికులకు కుక్క పిల్లలను దత్తత ఇచ్చారు. కుక్క పిల్లల దత్తత పై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జంతువులలో కుక్క అత్యంత విశ్వాసమైనదని అన్నారు. వీటిని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అదే సమయంలో రానున్న వానా కాలం కుక్కకాట్లు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, కుక్కకాట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా వీధులలో ఎక్కడపడితే అక్కడ ఆహార పదార్థాలు, చెత్తాచెదారం వేయడం వల్ల రోడ్డుపై చెత్త వేయడం కాలనీలో వేయడం వల్ల ఆహారం కోసం కుక్కలు విధులలోకి వస్తాయని, అదే సమయంలో చిన్న పిల్లలు, పాఠశాల పిల్లలు కుక్కకాటుకు గురయ్యే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని వీధులలో చెత్తా,చెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నల్గొండ జిల్లాలో జంతు జనన కేంద్రం ఉన్నందున ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కుక్కలను దత్తతగా పొందినవారు వాటిని కాపాడుకోవాలని ,వాటిని వీధిలోకి వదలకుండా ఇంట్లోనే పెంచుకోవాలని, సమయానికి వాటికి ఆహారం అందిస్తూ చక్కగా పెంచుకోవాలని సూచించారు. ప్రజలు కుక్కల పట్ల అవగాహన పెంచుకోవాలని, కుక్క కాటుకు గురికాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,